# ఓట్ల కోసం అబద్ధాలు చెప్పం



ధర్మపురి మండలం గోవిందుపల్లిలో వీధివీధినా ప్రచారం చేస్తున్న ధర్మపురి అభ్యర్థి ఈశ్వర్

- ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతం
- పదేండ్లలో చేసిన అభివృద్ధి మీ కండ్లముందే ఉంది
- కాంగ్రెస్‌ను నమ్మితే గోసపడుతరు
- పనిచేసే ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలి
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్
- కమలాపూర్, నాగారంలో ప్రజా ఆశీర్వాద యాత్ర
- గోవిందుపల్లిలో ప్రచారం

ధర్మపురి, నవంబర్ 20: 'మేం చెయ్యి గుర్తోళ్ల లెక్క ఓట్ల కోసం లంగ మాటలు చెప్పం. నిజాయితీగా ఉంటం. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతం. ఈ పదేండ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు మీ కండ్ల ముందే ఉన్నయి. ఒకప్పుడు ధర్మపురి నియోజకవర్గం ఎట్లుండె.. ఇప్పుడెట్ల మారిందో.. చూడండి. ఆలోచించండి. మీ వెన్నంటి ఉండే నన్ను ఆశీర్వదించి, అసెంబ్లీకి పంపించండి' అని ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ధర్మపురి మండలం కమలాపూర్, నాగారం గ్రామాల్లో సోమవారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. అంతకు ముందు గోవిందుపల్లిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చేరుకున్న మంత్రికి మహిళలు ఘన స్వాగతం పలికి తిలకం దిద్దారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్, ఆయాచోట్ల వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. 'నేను చేసిన పనులను ప్రచారంలో చెప్పే టైంలో ఒకటి రెండు మరిచిపోయినా ప్రజలే గుర్తుచేస్తున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం పనితీరుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి. అధికార దాహంతో కాంగ్రెస్ నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నరు. అబద్ధాలు చెబుతున్నరు. నమ్మితే గోసపడుతరు. వాళ్లను నమ్మద్దు. పని చేసే ప్రభుత్వానికే పట్టం గట్టాలె' అని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాక ముందు ఎక్కడ చూసినా రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆకలిచావులు, వెయ్యి ఫీట్ల బోర్లు వేసినా నీళ్లు పడక గొడగొడ ఏడ్చిననాడు మీ కన్నీళ్లు తుడిచేందుకు ఎవరైనా వచ్చారా..? ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఎన్ని బాధలు పడ్డామో..? గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పడ్డ కరెంట్ బాధలు ఎలా ఉండెనో ఒకసారి అవగతం చేసుకోవాలని, మళ్లీ ఆ నరకం మనకు అవసరమా..? అని ప్రశ్నించారు. ముక్కిపోయిన మూడు గంటల కరెంట్ కావాలా.. 24గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా.. ఆలోచించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ కర్ణాటక మోడల్ నమ్ముకుంటే కటిక చీకట్లోకి వెళతామన్నారు. నాటి పాలనలో రూ.200 మాత్రమే ఇచ్చేవారని, అది ఏ మూలకూ సరిపోయేదికాదన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్‌ను మొదట రూ.వెయ్యి ఇచ్చి కొద్ది రోజులకే రూ.2వేలకు పెంచుకున్నామన్నారు. ఇప్పుడు రూ.3వేలు, రూ.4వేల వరకు ఇచ్చుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా.. వెయ్యి రూపాయలు దాటి ఇస్తున్నారా..? చెప్పాలని ప్రశ్నించారు. అక్కడ రూ.1000కి మించి ఇవ్వనోళ్లు.. ఇక్కడ రూ.4వేలు ఇస్తామంటే ఎలా నమ్మాలి..? అని ప్రశ్నించారు. పేదల సంక్షేమం కోసం ఆలోచించి అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ రూపొందించిన మ్యానిఫెస్టో పార్టీ విజయానికి నాంది అవుతుందన్నారు. ప్రజలు చైతన్యవంతంగా ఆలోచించి పని చేసే ప్రభుత్వానికే మద్దతు పలుకాలని, బీఆర్ఎస్ కారుగుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఇక్కడ డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీలు బాధినేని రాజేందర్, బత్తిని అరుణ, ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, మండల ఆర్బీఎస్ కన్వీనర్ సౌళ్ల భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేశ్, వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్ కుమార్, కమలాపూర్, నాగారం సర్పంచులు కొండపెల్లి లక్ష్మి, రూపు సత్తెమ్మ, నాయకులు కొండపెల్లి సుధాకర్‌రావ్, కుమ్మరి లక్ష్మణ్, రాజేంద్రప్రసాద్, సట్టంశెట్టి అనీల్, సాయిని వినయ్, నరేశ్, లక్ష్మణ్, రాజుగౌడ్ ఉన్నారు.



మెట్‌పల్లి: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రభాకర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో కోరుట్ల అభ్యర్థి సంజయ్‌కల్వకుంట్ల

# బీఆర్ఎస్‌లోకి సాంబారి ప్రభాకర్

- హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన అమాత్యుడు
- గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం

మెట్‌పల్లి, నవంబర్ 20: మెట్‌పల్లి మాజీ సర్పంచ్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు సాంబారి ప్రభాకర్ భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఇటీవల బీజేపీకి రాజీనామా చేసిన ఆయన, సోమవారం మెట్‌పల్లి నుంచి పద్మశాలి సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ వెళ్లారు. తెలంగాణ భవన్‌లో కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రభాకర్‌తో పాటు పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన పలువురి నాయకులు, అనుచరులకు మంత్రి కేటీఆర్ గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్‌లో సాంబారి ప్రభాకర్‌తోపాటు ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన దాసరి రాములు, నందగిరి రాజేంద్రప్రసాద్, చాట్ల గణేశ్ తదితరులు పార్టీలో చేరా రు. వీరి వెంట బీఆర్ఎస్ నాయకులు జిందం లక్ష్మీనారాయణ, రాపెల్లి సురేశ్ తదితరులు ఉన్నారు.

# జీవన్‌రెడ్డి పేదలకు ఏం చేసిండు

- 40 ఏండ్ల రాజకీయంలో ఒక్కసారి కూడా వాళ్లు గుర్తుకురాలేదా
- కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే
- జగిత్యాల అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్‌కుమార్
- పలుగ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లు



కల్లెడలో మాట్లాడుతున్న జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్, నవంబర్ 20: 'ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని 60ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌కు, ఇక్కడ 40ఏండ్ల రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అనుభవించిన జీవన్‌రెడ్డి పేదలకు చేసిందేమీ లేదు. ఇన్నేండ్ల పదవీకాలంలో ఏనాడూ వాళ్లు గుర్తుకురాలేదా..? పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక సహాయం చేద్దామని ఇప్పుడు యాదికి వచ్చిందా..?' జగిత్యాల అభ్యర్థి డాక్టర్ ఎం సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, సోమన్‌ఫెల్లి, సంఘంపెల్లి, హబ్సీపూర్, తక్కల్లపెల్లి గ్రామాల్లో సోమవారం కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి, బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల సంజయ్‌కుమార్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన పదేండ్లుగా పేదల పక్షానే ఉందని, పెంచిన పెన్షన్లు, కల్యాణలక్ష్మి, ఒంటరి మహిళలు, బీడీ కార్మిలకు పెన్షన్‌లు, బడుల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వంటి పథకాలే నిదర్శనమన్నారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, 40ఏండ్ల నుంచి ప్రజాజీవితంలో ఉన్న జీవన్‌రెడ్డి పేదల గురించి ఎందుకు ఆలోచించలేదో..? చెప్పాలని, పేదింటి ఆడబిడ్డల పెండ్లికి ఆర్థిక సహాయం చేయాలనే ఆలోచన అధికారంలో ఉన్నప్పుడెందుకు..? రాలేదో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచే పదేండ్లుగా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి పెన్షన్ రాని మహిళలందరికీ సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా పెన్షన్ అందిస్తామని, ఎటువంటి ఆధారం లేని వారికి కేసీఆర్ బీమా పేరుతో రూ. 5లక్షల బీమాను అందిస్తామన్నారు. గుత్రాజ్‌పెల్లి నుంచి గొల్లపెల్లి దాకా రోడ్డు వేయించామని, బ్రిడ్జిని సైతం నిర్మించామన్నారు. గతంలో కరంటు ఎట్లుండెనో..? అందరూ గుర్తు చేసుకోవాలని సూచించారు. పంట పొలాలకు నీళ్లు పెట్టాలంటే టార్చ్‌లైట్లు పట్టుకొని బావులకాడికి పోయిన రోజులు, అక్కడే తెల్లవారేదాక ఉన్న రోజులు యాదికి చేసుకోవాలని సూచించారు. సీఎంగా కేసీఆర్ వచ్చిన తర్వాతనే కరంటు కష్టాలు తొలగిపోయాయన్నారు. కరంటు కష్టాలు మళ్లీ రావద్దంటే 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌నే గెలిపించాలన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో అన్ని గ్రామాలను, అన్ని వర్గాలను అభివృద్ధి చేశామన్నారు. తాము ఉత్త విషయాలు చెబుతలేమని, చేసిన పనులు కండ్ల ముందే కనిపిస్తున్నాయన్నారు. ఇంకా చేయాల్సిన పనుల గురించి హామీ ఇస్తున్నామని వివరించారు. హామీల అమలు, అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాగా, కల్లెడ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు లింగన్న, శ్రీనివాస్, తిరుపతి,రాజేశ్ ఆధ్వర్యంలో 20 మంది బీఆర్ఎస్‌లో చేరగా, డాక్టర్ సంజయ్‌కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ సర్పంచులు జోగినిపెల్లి మహేశ్వర్‌రావు, గడ్డం జైపాల్‌రెడ్డి, సింగం అరుణ, మారు రాజేశ్వర్‌రెడ్డి, అంకతి మల్లవ్వ, ప్యాక్స్ చైర్మన్లు జోగినిపెల్లి సందీప్‌రావు, పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, నక్కల రవీందర్‌రెడ్డి, దశరథరెడ్డి, దావ సురేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలముకుందం పాల్గొన్నారు.

# ఐదేండ్లకోసారి వచ్చేటోళ్లా..
# మీ వెంట ఉండేటోళ్లా..



కొండ్రికర్లలో స్వాగతం పలుకుతున్న మహిళలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్

- ఎవరు కావాలో మీరే నిర్ణయం తీసుకోండి
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తరు
- మేము చేసినవి.. చేయబోయేవి చెబుతున్నం
- కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- మెట్‌పల్లి మండలంలో ఎన్నికల ప్రచారం

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 20: ''ఎన్నికలొచ్చినయంటే ఎప్పుడూ కనబడని వారందరూ కనబడుతరు.. ఐదేళ్లకోసారి వచ్చే నాయకులు కావాలా.. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండే నాయకులు కావాలా..? ప్రజలు ఆలోచన చేయాలని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్, కొండ్రికర్ల, కనరావుపేట, రామారావుపల్లె, చింతలపేట గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించగా, యువకులు, మహిళలు, రైతులు, వృద్ధులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజయ్ ప్రసంగించారు. 'ఎంపీ అయిన బీజేపీ అభ్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఐదేళ్లలో ఎన్నిసార్లు మీ గ్రామాలకు వచ్చారు. ఏం చేశారో' ఒకసారి ప్రజలు గమనించాలన్నారు. 65 ఏండ్లలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని కేసీఆర్ సీఎం అయ్యాక చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ రాకముందు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, బీడీ పింఛన్లు, సమయానికి ఎరువులు ఎవరైనా ఇచ్చారా..? ఆలోచన చేయాలని సూచించారు. కేసీఆర్ వచ్చాక ఏడాదిలోపు మెరుగైన కరెంటు ఇచ్చారని, దేశంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. కరోనా కాలంలో కూడా సంక్షేమ పథకాలు ఆపలేదని, అందుకే అభివృద్ధి పనుల్లో భాగంగా కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణం కొంత ఆలస్యమైందని చెప్పారు. నిధులు వచ్చాయి కాబట్టే బ్రిడ్జికి శంకుస్థాపన చేశామని, ఎన్నికల తర్వాత పనులు సైతం ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి ఎంపీగా మీ గ్రామాల్లో ఎన్ని అభివృద్ధి పనులు చేశాడో తెలపకుండా సంస్కారహీనంగా ప్రవర్తించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల కోసం ఏ నాయకుడు నిలబడుతాడో.. ఏ ప్రభుత్వం నిలబడుతుందో ఆలోచన చేయాలని కోరారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు కన్నీళ్లు వస్తే.. కేసీఆర్ వచ్చాక మంచినీళ్లు వచ్చాయని వివరించారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేసి మరోసారి కేసీఆర్ ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచులు కోరెపు రవి, కోరెపు శ్యామల, ఎగుర్ల లక్ష్మి, మ్యాకల అర్చన, ఎంపీటీసీ తేలుకంటి శంకరయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు అనిరెడ్డి మారుతి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజరెడ్డి, బీసీసెల్ మండలాధ్యక్షుడు మెండె రమేశ్ పాల్గొన్నారు.